రేణిగుంట విమానాశ్రయ పెండింగ్ అంశాలపై సమీక్షించిన కలెక్టర్

విశాలాంధ్ర - తిరుపతి : రేణిగుంట విమానాశ్రయానికి చెందిన భూసేకరణ, వాటి నష్టపరిహారం చెల్లింపు, సంబంధిత భూమిని విమానాశ్రయ అధికారులకు అప్పగించే దిశలో వివిధ దశలలో కోర్టులో ఉన్న అంశాలపై సకాలంలో స్పందించి కౌంటర్ ఫైల్ చేయాలని కోర్టు ఆదేశాల మేరకు జిపి ను సంప్రదించి తదుపరి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి జెసి డీకే బాలాజీ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ విమానాశ్రయం కొరకు 3.4 ఎకరాల సంబంధిత భూసేకరణ కొరకు ఆర్డిఓ శ్రీకాళహస్తి వారు నిబంధనల మేరకు తగు చర్యలు చేపట్టవలసిందిగా ఆదేశించారు. అలాగే విమానాశ్రయం పరిధిలో ఉన్న హైమాస్ట్ ట్రాన్స్మిషన్ టవర్స్ ను అక్కడనుండి తొలగించుటకు చర్యలు చేపట్టాలని సంబంధిత ఏపీ ట్రాన్స్కో, కె ఈ ఐ అధికారులకు సూచించారు. షిఫ్టింగు కొరకు 90.22 కోట్లకు ప్రతిపాదనలు పంపగా 37.99 కోట్లు సంబంధిత ఏజెన్సీలకు విడుదల చేయబడి మిగిలిన 52.23 కోట్లు తొందరలోనే విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయని, హై మాస్ట్ టెన్షన్ టవర్ల షిఫ్టింగ్ కార్యక్రమం త్వరితగతిన చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో రేణిగుంట విమానాశ్రయం అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి నేషనల్ హైవే పిడి హరికృష్ణ ఏర్పేడు తాసిల్దార్ ఉదయ్ సంతోష్ రేణిగుంట తాసిల్దార్ శివప్రసాద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం:శ్రీకాళహస్తిలో సంబరాలు

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి : రష్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి సమక్షంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైఎస్ఆర్సిపి పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైయస్సార్ పార్టీ ఆయనను ప్రకటించడంతో శ్రీకాళహస్తిలో వన్నె కుల క్షత్రియలు సంబరాలు నిర్వహించారు. ముందుగా స్థానిక పెళ్లి మండపం వద్ద బాణసంచి కాల్చి స్వీట్లు ఒకరికొకరు పంచుకొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డి మాట్లాడుతూ బీసీలకు వైయస్ఆర్సీపీ పార్టీలో తగిన గుర్తింపు ఉందన్నారు. రాబోయే ఎన్నికలలో బియ్యపు మధుసూదన్ రెడ్డి అత్యంత భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. అనంతరం వన్నె కుల క్షత్రియ సంఘం గౌరవ అధ్యక్షులు బుజ్జి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కృష్ణారెడ్డి, బజాజ్ మురళీ కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ కంఠ ఉదయ్ కుమార్, వైఎస్ఆర్సిపి యువజన అధ్యక్షులు మధు రెడ్డి, మల్లెం బాక ముని కృష్ణారెడ్డి,జివికే రెడ్డి,ముత్యాల కృష్ణ,ఎమ్మెస్ రెడ్డి చలపతి రెడ్డి,దాము,కార్తీక్,హేమంత్,సాయి రెడ్డి, సుధాకర్ రెడ్డి,శివ రెడ్డి దీపక్,చంద్ర రెడ్డి భారీ సంఖ్యలో సంఘం నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

బీద మస్తాన్ రావును కలిసిన మేరిగ మురళీధర్

విశాలాంధ్ర - తిరుపతి: ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంపిక చేసినందుకు రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావును సోమవారం మేరిగ మురళీధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ఆహ్వానించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం మేరిగ మురళీధర్ వరుసగా మంత్రులు, వైసీపీ ముఖ్యులను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. అలాగే బుధవారం నామినేషన్ దాఖలుకు హాజరుకావాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి మేరిగ మురళిధర్ స్థానిక విలేకరులతో చరవాణిలో మాట్లాడారు. తనపై నమ్మకముంచి, పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆజన్మాంతం జగన్ వెంటే ఉంటానన్నారు. పార్టీని మరింత పటిష్టం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. నామినేషన్ దాఖలు కార్యక్రమానికి గూడూరు నియోజకవర్గ వైసీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

దళిత జడ్పీటీసీని అవమానపరిచిన వారిని వెంటనే అరెస్టు చేయాలి: సీపీఐ

విశాలాంధ్ర - తిరుపతి : చిల్లకూరు జెడ్పీటీసీ మన్నెం శీనయ్యను దారుణంగా అవమానపరిచిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి సీహెచ్. ప్రభాకర్ మాట్లాడుతూ వారం రోజుల క్రితం చిల్లకూరు జెడ్పీటీసీ గదిలోని కుర్చీపై మూత్రం పోసి అనాగరిక చర్యలకు పాల్పడిన ప్రవీణ్ రెడ్డి, అతని అనుచరులపై ఇంత వరకూ చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. దళిత జడ్పీటీసీని అవమానించినా, అట్రాసిటీ కేసు నమోదు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, దళిత సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జీ. శశికుమార్ మాట్లాడుతూ గూడూరు డివిజన్ లో మైనారిటీలు,దళితులపై దాడులు అధికమైపోతున్నాయన్నారు. చిల్లకూరు మండలం పునపరవారిపాలెంలో అగ్రవర్ణాలు మైనారిటీలపై దాడులకు పాల్పడినా పోలీసులు స్పందించలేదన్నారు. అదే పరిస్థితి ప్రస్తుతం దళిత జెడ్పీటీసీ మన్నెం శీనయ్యకు చోటుచేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులను వెంటనే అదుపులోకి తీసుకుని విచారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గూడూరు పట్టణ కార్యదర్శి షేక్. కాలేషా, చిల్లకూరు మండల కార్యదర్శి ఆర్. రమేష్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఎంబేటి చంద్రయ్య, ఇన్సాఫ్ సమితి రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్. జమాలుల్లా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బీ. యాకోబు, వై. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో సోమవారం జరిగిన స్వామివారి కళ్యాణానికి తరలి వెళుతున్న అధికారులు

జిల్లాలో మాతాశిశు మరణాలు జీరో స్థాయికి రావాలి:కలెక్టర్

విశాలాంధ్ర - తిరుపతి : జిల్లాలో మాతాశిశు మరణాలు జీరో స్థాయికి రావాలని వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలు వైద్యం అందించడంలో, పోషకాహారాలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి ఆదేశించారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా ప్రసూతి మరణాల నిఘా, ప్రతిస్పందన (ఎండిఎస్ఆర్) కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అద్యక్షతన వైద్య అధికారులతో ప్రసూతి మరణాలకు సంబందించిన వారి కుటుంబీకులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత డిసెంబర్ మాసంలో జరిగిన రెండు మాతృ మరణాలు, ఐదు శిశు మరణాలపై సమీక్ష నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖకు కొన్ని వేల కోట్లు ఖర్చు చేస్తున్నదని బాధ్యతతో వైద్యశాఖ గర్భిణీలకు వైద్యం అందించడంలో శ్రద్ధ కనబరచాలని, మహిళా శిశుసంక్షేమ శాఖ పోషకాహార లోపాలు ఉన్న గర్భిణీలకు సరైన పోషకాహారం అందించడం ఇరాన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు సరైన సమయానికి వాడేలా చూడాలని అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు.మాతృ మరణాలకు సంబంధించి వాకాడు మండలం బాలిరెడ్డి పల్లి అఖిల, దక్కిలి మండలం వెంకటరమణమ్మ మరణాలపై చికిత్స అందించిన డాక్టర్లతో, కుటుంబ సభ్యులతో వైద్య చికిత్సలపై ఆరా తీశారు. హై రిస్క్ గర్భవతులు అని గుర్తించినా స్థానికంగా చికిత్స అందించడం, కనీసం ప్రసవానికి వారం ముందే ప్రధాన ఆసుపత్రులలో చేర్పించకపోవడం అలసత్వం అవుతుందని పూర్తి స్థాయి విచారణకు డిఎంఅండ్హెచ్ఓను ఆదేశించారు. 108 వాహ నాలు హై రిస్క్ గర్భవతులకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని, పిహెచ్సి డాక్టర్లు 108 కాల్ సెంటర్ తో పాటు స్థానిక డ్రైవర్ నంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. శిశు మరణాలకు సంబంధించి పిచ్చాటూరు మండలం ముడియూరు బేబి ఈశ్వర్ కు పాలు పట్టడంలో తల్లిదండ్రుల పొరపాట్లు, దక్కిలి కి సంబంధించి చెంచు లక్ష్మీ బేబి బరువు తక్కువతో పుట్టడం, గూడూరు మండలం చెన్నూరు శ్రీలత బేబి గుండెకు రంధ్రం, చిల్లకూరు మస్తానమ్మ బేబి తీవ్ర జ్వరంతో , శ్రీకాళహస్తి ఎంపేడు ప్రమీలమ్మ బేబి బరువు తక్కువతో పుట్టడం వల్ల మరణాలు సంభవించడం జరిగిందని, వైద్య అధికారులు, శిశు సంక్షేమ శాఖ అంగన్వాడీలు, ఏఎన్ఎంలు, ఆశా లు సరైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు త్వరలో శిక్షణ ఇవ్వాలని, తల్లిదండ్రులకు ఇవ్వవలసిన జాగ్రత్తలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లాలో మాతృ మరణాలకు తావివ్వరాదని ఆదేశించారు. ఈ సమీక్షలో కమిటీ కన్వీనర్ డిఎంహెచ్ఓ శ్రీహరి, డిసిహెచ్ఎస్ ప్రభావతి, ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, డిఐఓ శాంత కుమారి, చిన్న పిల్ల ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుణ, ఎండిఆర్ నోడల్ ఆఫీసర్ డా.నీలిమ, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ ప్రసన్నా టాగూర్, సిడిపిఓ పద్మజ, 108 సర్వీసెస్ పవన్ కుమార్, పి.హెచ్.సి. డాక్టర్లు, మాతృ శిశు మరణాలు జరిగిన కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

రహదారి ప్రమాదాలను తగ్గించే దిశగా చర్యలు ఉండాలి

యాక్సిడెంట్లలో క్షతఘాత్రులకు గోల్డెన్ అవర్ లోపు ఆసుపత్రులలో చేర్పించి ప్రాణాలు కాపాడాలి : డిఆర్వో

విశాలాంధ్ర - తిరుపతి : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, యాక్సిడెంట్లలో గాయపడిన క్షతఘాత్రులకు గోల్డెన్ అవర్ లోపు ఆసుపత్రులలో చేర్పించి ప్రాణాలు కాపాడడం మన అందరి భాద్యత అని, రహదారి ప్రమాదాలలో మరణిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నదని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలు తప్పక పాటించి ప్రమాదాలు, మృతుల సంఖ్య తగ్గించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు అన్నారు.సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన జిల్లా రహదారి భద్రత సమావేశంలో డి ఆర్ ఓ సమీక్షిస్తూ యాక్సిడెంట్ల నివారణ చర్యల పై నేషనల్ హైవే, ఆర్అండ్బి అధికారులు హెల్త్, పోలీస్, రవాణా శాఖ అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను, మరణాలను నివారించుటకు అన్ని శాఖల సమన్వయంతోనే సాధ్యమన్నారు. ఎంఆర్పల్లి ఏర్పేడు శ్రీకాళహస్తి, చిల్లకూరు గూడూరు తదితర ఎన్హెచ్ 16, ఎన్ హెచ్ 71 ఎన్హెచ్ 205 రహదారుల లో ప్రమాదకర మలుపులు వద్ద భద్రతా పరమైన సైన్ బోర్డులు, అవసరమైన చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలలో చాలా మందికి రహదారి నియమావళి పై అవగాహన లేకపోవడం, డ్రైవర్ల అవగాహన లోపం, బాధ్యత రాహిత్యం వలన చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాత్రివేళ జాతీయ రాష్ట్ర రహదారులపై ఎట్టిపరిస్థిల్లో వాహనాలు నిలపరాదని అన్నారు. తప్పనిసరిగా అన్ని వాహనాల వెనుక వైపున రేడియం స్టిక్కర్ ఏర్పాటు చేసుకునేలా సంబంధిత రవాణా శాఖ, పోలీసు అధికారులు చూడాలని అన్నారు. ఎన్ హెచ్ సాంకేతిక ప్రమాణాలను అధికారులు తప్పక అమలు చేయాలని సూచించారు. టోల్గేట్ సమీపంలో డ్రైవర్లు రాత్రి సమయంలో సేద తీరే విధంగా సుమారు 5 ఎకరాలు భూమిని గుర్తించాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గుడ్ సమారిటన్ స్కీం కింద ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సకాలంలో గోల్డెన్ హవర్ లో ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేసి ఆసుపత్రులకు తరలించిన వారికీ ప్రోత్సాహకంగా రూ.5 వేలు అందించబడుతుందని, ప్రతి పౌరుడు భాద్యతతో వ్యవహరించి ప్రమాద బాదితులకు అండగా నిలవాలని తెలిపారు. ఇలాంటి గుడ్ సమారిటన్ ల వివరాలను పోలీసులు నిర్బందించి తీసుకోవడానికి కోర్టుకు రావాలని ఇబ్బంది పెట్టడం జరగదని అన్నారు. పోలీసులు తదనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. క్షతగాత్రులను చేర్చిన ఆసుపత్రులలో ప్రమాద బాదితుల వివరాలు కేంద్ర ప్రభుత్వం ఎన్.ఐ.సి వరి ఐరాడ్ యాప్ లో నమోదు చేయడం ద్వారా జాతీయ స్థాయి వరకు ఈ వివరాలు అందుబాటులో ఖచ్చితత్వంతో ఉంటాయని సంబందిత డాక్టర్ లు దీనిపై పూర్తి అవగాహనతో ఉండాలని తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఆసుపత్రిలో గుడ్ సమ్మారిటన్ పథకం గురించి అందరికీ కనపడే విధంగా వివరాలను పొందుపరచాలని అన్నారు. డి ఎం హెచ్ ఓ దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు, ఎన్.జి.ఓ లు అవగాహన కలిగి ఉన్నారని వారు గుడ్ సమారటన్ గా క్షతగాత్రులకు వారి వంతు సహాయంగా ఆస్పత్రులకు తరలించే కార్యక్రమం లో పాలు పంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారి, రవాణా శాఖ, ట్రాఫిక్ డిఎస్పి, ఎన్ హెచ్ అధికారులు ఎన్హెచ్ 205 సి మల్లవరం జంక్షన్ నుండి రామానుజపల్లి రామచంద్రపురం జంక్షన్ తనపల్లి తిరుచానూరు జంక్షన్లు పరిశీలించి సైన్ బోర్డ్స్ బ్లింక్స్, జీబ్రా లైన్స్, లైటింగ్ ఏర్పాటు కొరకు చర్యలు చేపట్టామని జిల్లా రవాణా శాఖ అధికారి సీతారామరెడ్డి తెలిపారు.లీల మహల్ నుండి కరకంబాడి రోడ్డు మార్గంలో ఎక్కువ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఏటా ఇరవై శాతం రహదారి ప్రమాదాలను తగ్గించే దిశలో చర్యలు ఉండాలని ప్రభుత్వం నిర్దేశించిందని ఈ అంశంపై ఉన్నత స్థాయిలో సమీక్ష చేస్తున్నారని కమిటీకి వివరించారు.ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ పి డి హరికృష్ణ, ఆర్డీవో లు కనక నరసారెడ్డి రామారావు ట్రాఫిక్ డిఎస్పి కాటమ రాజు, జిల్లా ఆర్ అండ్ బి అధికారి సుధాకర్ రెడ్డి, రవాణా శాఖ ఎం.వి.ఐ లు, ఎన్.హెచ్.ఓ లు, ఎన్ హెచ్ , అర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యానికి ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ- జేఈవో సదా భార్గవి

విశాలాంధ్ర -తిరుపతి : కోవిడ్ అనంతర పరిణామాల నేపథ్యంలో ఆయుర్వేద వైద్యానికి ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ లభిస్తోందని టీటీడీ జేఈవో సదా భార్గవి చెప్పారు. విద్యార్థులు ఆయుర్వేద వైద్యాన్ని ఇష్టపడి చదివి లోతైన పరిజ్ఞానం సంపాదిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద కళాశాల 2022-23 బ్యాచ్ నూతన విద్యార్థులకు 15 రోజుల శిక్షణా కార్యక్రమం కళాశాలలో సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జేఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీమతి సదా భార్గవి మాట్లాడుతూ, శ్రీ వేంకటేశ్వర స్వామి పాదాల చెంత విద్యనభ్యసించడం విద్యార్థుల పూర్వజన్మ సుకృత మన్నారు. ఎంబిబిఎస్ సీటు రానందువల్ల ఆయుర్వేద వైద్యంలో చేరామనే అభిప్రాయం ఉంటే వెంటనే వదిలేయాలన్నారు. ఎంబిబిఎస్ సీటు వదులుకుని ఆయుర్వేద వైద్య కోర్సులో చేరుతున్న వారు చాలామంది ఉన్నారని ఆమె తెలిపారు. భారతీయ సనాతన వేదాలతో మిళితమై ఉన్న ఆయుర్వేద వైద్యాన్ని ప్రపంచమంతా ఆదరిస్తోందన్నారు. కోవిడ్ సోకిన వారు, కోవిడ్ సోకకుండా ముందు జాగ్రత్తలు పాటించిన వారు ఆయుర్వేద కషాయాలు, మందులు వాడిన విషయం అందరికీ తెలుసు నన్నారు. భారతీయుల వంటిల్లే పెద్ద వైద్యాలయమని ఆమె చెప్పారు. సామాజిక, వాతావరణ మార్పుల వల్ల జనానికి అనేక జబ్బులు వస్తున్నాయని, వీటిని పూర్తిగా నయం చేయడం, రాకుండా చేయగలిగే శక్తి ఆయుర్వేదానికి ఉందని జేఈవో వివరించారు. ఆయుర్వేద వైద్యం సమాజానికి ఎలా ఉపయోగపడుతుందో అర్థం చేసుకుని దాన్ని జనంలోకి తీసుకుని వెళ్లాలని పిలుపునిచ్చారు.టీటీడీ ఆయుర్వేద కళాశాలకు 40 సంవత్సరాల చరిత్ర ఉందని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. కళాశాలలో సెమినార్ హాల్ నుంచి అవసరమైన అన్ని వసతులు అభివృద్ధి చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయస్థాయి సెమినార్లు,వర్క్ షాప్ లు నిర్వహిస్తామన్నారు. 15 రోజుల శిక్షణా కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడు తుందన్నారు. ఆయుర్వేద కళాశాలను ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ, ఆయుర్వేద ఆసుపత్రిని సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్ చక్కగా నిర్వహిస్తున్నారని జేఈవో అభినందించారు.ప్రిన్సిపల్ డాక్టర్ మురళీ కృష్ణ కళాశాల ప్రగతి, ఇక్కడి విద్యార్థులు సాధించిన విజయాలు, అందుకున్న ఉన్నత స్థానాల గురించి వివరించారు.ఆసుపత్రి అభివృద్ధి, నిర్వహణ పై సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలియజేశారు.కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుందరం తో పాటు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా మేరిగను ప్రకటించడం హర్షణీయం

పార్టీ విధేయులకు వైసీపీలో ప్రాధాన్యత - వైసిపి స్టేట్ జనరల్ సెక్రటరీ కొండూరు సునీల్ రెడ్డి

విశాలాంధ్ర -తిరుపతి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో విధేయులకు, పని చేసిన వారికి ఎప్పుడు ప్రాధాన్యత ఉంటుందని స్టేట్ జనరల్ సెక్రెటరీ కొండూరు సునీల్ కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం పాటిస్తూ, సమ న్యాయ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని సునీల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం టవర్ క్లాక్ సెంటర్ లో వైసీపీ నాయకులు మేరిగ మురళీదహధర్ కు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల బాణా సంచా పేల్చి వైసీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కొండూరు సునీల్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుండి వెన్నంటి ఉన్న నాయకుడు మేరిగ మురళికి ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించడం గూడూరు నియోకవర్గ ప్రజలకు ఎంతో హర్షణీయమన్నారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించిన వెంటనే గూడూరు పట్టణంలో సునీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, స్థానిక 24 సొసైటీ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి టవర్ క్లాక్ సెంటర్ వద్ద బాలాసంచా పేల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వెన్నంటి ఉండి పార్టీ అభివృద్ధికి కృషిచేసిన మేరిగ మురళికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మేరిగ మురళి గూడూరు నియోజకవర్గంలో ప్రతి కుటుంబంలో సభ్యులను పేరు ఎత్తి పిలిచే వ్యక్తి అని అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి అని తెలిపారు. మేరిగ మురళి నాయకత్వంలో జరగబోవు సాధారణ ఎన్నికల్లో గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా జగన్మోహన్ రెడ్డి ఎవరిని ప్రకటించినా ఆ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి కానుకగా అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల పరిషత్ అధ్యక్షులు గురవయ్య, గూడూరు 24 పిఏసిఎస్ అధ్యక్షులు అట్ల శ్రీనివాసులురెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ బాబు రెడ్డి,తిరుపతి పార్లమెంట్ జిల్లా ఎస్సీ సెల్ యువత కార్యదర్శి కొట్టు అశోక్, ఏఎంసి చైర్మన్ కొట్టు గోవర్ధన్, వైసీపీ నాయకులు విద్యాసాగర్ ,,రమణారెడ్డి, రమణారెడ్డి గోపి యాదవ్, మల్లీ శ్రీనివాసులు, ఫణీంద్ర రెడ్డి, దయాకర్, చక్రపాణి పాల్గొన్నారు.

భక్తులకు ఆరోగ్యం పై అవగాహన

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : వాయులింగేశ్వరుని బ్రమోత్సవాలలో భాగంగా నగిరి వీధిలోని స్టేప్స్ సంస్థ కార్యాలయం వద్ద ఫథక సంచాలకులు డాక్టర్ ప్రమీలమ్మ భక్తులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తదనంతరం ఉచితముగా మందులు పంపిణి చేశారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 15 వ తేదీ నుంచి నేటివరకు భక్తులకు ప్రతి రోజు మజ్జిగ, అన్నదానం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, గాయత్రి, సురేష్ , దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరునికి టీటీడీ పట్టు వస్త్రాలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆది దంపతుల కల్యాణం కోసం సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం కార్య నిర్వహణాధికారి ఏవీ ధర్మారెడ్డి దంపతులు ఈ పట్టు వస్తరాలు తీసుకువచ్చారు. పట్టు వస్త్రాలను తీసుకువచ్చిన ధర్మారెడ్డి దంపతులకు ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ కార్య నిర్వహణాధికారి కేవీ సాగర్ బాబు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. మణికంఠ ఆలయం వద్ద నుంచి పట్టు వస్త్రాలను మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య వేడుకగా తీసుకెళ్లారు. అలంకార మండపంలో ఈ పట్టు వస్త్రాలను వేదపండితులకు శాస్త్రోక్తంగా అందజేశారు. అనంతరం ధర్మారెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. కాగా శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ అమ్మవారి కల్యాణం కోసం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి, విజయవాడ కనకదుర్గ ఆలయాల ఆధ్వర్యంలో కూడా పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అధికారులు వీరికి సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికి... పట్టు వస్త్రాలను స్వీకరించారు.

వాషింగ్ పౌడర్ తయారీపై శిక్షణ

విశాలాంధ్ర - తిరుపతి : గూడూరు పట్టణంలోని సునీత సేవా సంస్థ కార్యాలయంలో సోమవారం వాషింగ్ పౌడర్ తయారీపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సునీత సేవా సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు కుట్టు శిక్షణ, వాషింగ్ పౌడర్ తయారీ, బ్యూటీషియన్, పుట్ట గొడుగుల పెంపకం తదితర చేతివృత్తి పనులపై శిక్షణ ఇచ్చి మహిళలు స్వయం శక్తితో ఎదిగేలా దోహదపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సునీత సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

తిరుమలలో మార్చి 1 నుంచి ప్రయోగాత్మకంగా ఫేస్ రికగ్నేషన్ టెక్నాలజీ

విశాలాంధ్ర - తిరుపతి : తిరుమలలో భక్తులకు అందుబాటులోకి టీటీడీ మరో అధునాతన టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురానుంది. శ్రీవారి సర్వదర్శనం, లడ్డూప్రసాదం, గదుల కేటాయింపు, రీఫండ్ చెల్లింపు తదితర అంశాల్లో మరింత పారదర్శకత పెంచేందుకు వీలుగా మార్చి ఒకటో తేదీ నుంచి ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీని టిటిడి ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది. సర్వదర్శనం కాంప్లెక్స్‌లో ఒకే వ్యక్తి అధిక లడ్డు టోకెన్లు పొందకుండా నివారించడానికి మరియు గదుల కేటాయింపు కేంద్రాలు వద్ద, కాషన్ డిపాజిట్ కౌంటర్ల వద్ద ఈ నూతన టెక్నాలజీని వినియోగిస్తారు.

జగన్ అన్న ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి:సిఐటియూ

కనీస వేతనం రోజుకి 700 పెంచాలి సిఐటియు డిమాండ్

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : అగ్రికల్చర్ యూనివర్సిటీ కళాశాల లో పనిచేస్తున్న కాంటాక్ట్ లేబర్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈరోజు అగ్రికల్చర్ యూనివర్సిటీ ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ కాంటాక్ట్ లేబర్ కార్మికులు గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ కనీసం వేతనం ఇవ్వడం లేదు అన్నారు, ఒకరోజు వేతనం 340 రూపాయలు ఇస్తున్నారు కానీ లేబర్ ఆక్ట్ ప్రకారం 750/- రూపాయలు ఇయ్యాలని చట్టం చెబుతున్నప్పటికీ వాటిని ఇవ్వడం లేదు, అదేవిధంగా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్తున్నప్పటికీ కూడా ఒక్క ప్రభుత్వ ఆఫీసుల్లో కూడా అవి అమలు జరగడం లేదు, అదేవిధంగా రికార్డ్ అని మహిళలు అనేక రకాలుగా కష్టపడుతున్నప్పటికీ వాళ్లకి ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు.వాళ్లు జాతీయ పండుగలు సందర్భంగా కూడా సెలవులు ప్రకటించడం లేదు అన్నారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే వాళ్ళ సమస్యలను పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. అనంతరం ఆర్ఎఆర్ఎస్ డిఆర్ఏకి వినతిపత్రం సమర్పించారు.తన పరిధిలో ఉన్న సమస్యలు అన్నిటిని కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వందవాసి నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి, ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గండికోట నాగవెంకటేష్, వెటర్నరీ యూనివర్సిటీ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, ఆర్ లక్ష్మి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అవినీగడ్డ పద్మజ, అగ్రికల్చర్ యూనివర్సిటీ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి రాకేష్, ఉపాధ్యక్షురాలు చంద్రమ్మ సుబ్రహ్మణ్యం, మదన్, రాధా, రమాదేవి, ప్రసాద్, మునిలక్ష్మి, నాగరత్న, జ్యోతి, సుశీల, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

ఎమ్మెల్సీ స్థానానికి ఒక నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర -చిత్తూరు: ప్రకాశం నెల్లూరు చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం ఒక నామినేషన్ దాఖలు అయింది. బాపట్ల జిల్లా చీరాల చెందిన నీలం శ్యాముల్ మేజెన్ స్వతంత్ర అభ్యర్థిగా సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఇప్పటివరకు ప్రకాశం నెల్లూరు చిత్తూరు పట్టబదుర్ల ఎమ్మెల్సీ స్థానానికి ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా, ప్రకాశం నెల్లూరు చిత్తూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఒకరు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. అయితే చిత్తూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఇంతవరకు ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదు. చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల్లో అధికార వైసీపీ పార్టీకి సంపూర్ణ మెజార్టీ ఉండడంతో ఈ ఎమ్మెల్సీ స్థానాన్ని అధికార పార్టీ కైవసం చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్రీకాళహస్తి చెందిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను అధికార పార్టీ ప్రకటించింది. ఈనెల 23వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించినన్నారు . ఈ తరుణంలో బుధవారం నాడు పలువురు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.

రిటైర్డ్ పోలీసులకు మెడల్స్ ప్రదానం

విశాలాంధ్ర -చిత్తూరు: పోలీస్ సర్వీస్ లో ఉన్నప్పుడు సమాజ సేవ చేసిన విశ్రాంత పోలీసులకు సైతం ఇండిపెండెన్స్ డే మెడల్స్ ను ప్రధానం చేయాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లాలో 36 మంది విశ్రాంత పోలీసులకు భారత ప్రభుత్వం ప్రకటించిన ఇండిపెండెన్స్ డే మెడల్స్ ను సోమవారం జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి ప్రదానం చేశారు .భారత ప్రభుత్వం, ప్రకటించిన 25వ ఇండిపెండెన్స్ డే మెడల్స్ ను ప్రస్తుతము అర్హులైన వారు రిటైర్డ్ అయినప్పటికీ, వారికి సమాచారము అందించి స్పందన కార్యక్రమము అనంతరం జిల్లా ఎస్పీ మెడల్స్ ను బహుకరించారు.పోలీసు సర్వీసులో ఉన్నప్పుడు సమాజ సేవలో విశ్రాంత పోలీసులు చేసిన సేవలను, ఎస్ పి గారు ప్రశంసించారు.పదవీ విరమణ చేసినా, తమ సేవలను గుర్తించి సమాజ దృష్టిలో తమకు మంచి గుర్తింపు ఇవ్వాలనే సదుద్దేశంతో ఎస్పీ తమకు మెడల్స్ ను బహూకరించడం సంతోషంగా ఉందని విశ్రాంత పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్, పి.జగదీష్, ఏఆర్. డిఎస్పీ మురళీధర్, ఆర్ఐ ఎంటిఓ మధు, ఎస్బీ డిఎస్పీ. శ్రీనివాస రెడ్డి, చిత్తూరు పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు ఉదయ కుమార్, విశ్రాంత పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు మురళి, సంఘ సభ్యులు మరియు విశ్రాంత పోలీసులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర -పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలంలో మార్చి మొదటి వారంలో జరుగు టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా లోకేష్ యువ గళం పాదయాత్రను విజయవంతం చేయాలని పాదయాత్ర పరిశీలకులు ప్రశాంత్ కుమార్, రవి యాదవ్ అన్నారు. లోకేష్ పాదయాత్ర రూట్ మ్యాప్ ను పులిచెర్ల మండలంలో జరుగు లోకేష్ పాదయాత్ర రూట్ మ్యాప్ ను సోమవారం వారు పరిశీలించారు. మండలంలో కొమ్మి రెడ్డి గారి పల్లె నుంచి పీలేరు మార్గంలోని ఎంజేఆర్ కళాశాల వరకు రూట్ మ్యాప్ సభాస్థల వేదికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ గళం పాదయాత్ర రాష్ట్రానికి కీలక మలుపు తీసుకురానున్నదని అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామనాథం నాయుడు, ఎంపీటీసీలు మునికృష్ణమనాయుడు, సింధు రవి, టిడిపి నాయకులు కృష్ణమూర్తి నాయుడు, ముల్లంగి వెంకటరమణ, శ్రీనివాసులురెడ్డి, ఇనాయ్ తుల్లా, దేవేంద్ర, నజీర్, రామ్మూర్తి, యల్లారెడ్డి, నాగరాజ నాయుడు, రవి ,రమణ, ఖాదరవల్లి, బాబు, అన్నా స్వామి, చంగల్రాయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలి:ఏఐటియూసి

విశాలాంధ్ర - నగరి: ఆర్డీవో కార్యాలయం దగ్గర గ్రీన్ అంబాసిడర్ కార్మికులసమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ రాజేంద్ర అధ్యక్షతన ధర్నా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య పాల్గొని మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకొచ్చిన సమస్య పరిష్కారం లేదు. అనేక సంక్షేమం పథకాలను ప్రవేశపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు గ్రామస్థాయిలో పరిశుభ్రం చేస్తూ ప్రజల్ని అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకుంటూ తడి చెత్త పొడి చెత్తను వేరు చేస్తూ గ్రామాల్లో అన్నింటిని శుభ్రపరుస్తూ పనిచేస్తున్న కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదు. సుమారు పది నెలల జీతాలు పెండింగ్లో ఉన్నప్పటికీ ప్రభుత్వము స్పందించడం లేదు.ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 680 ప్రకారం 15 వ ఫైనాన్స్ ద్వారా కార్మికులకు 10000 జీతాలు చెల్లిస్తామని చెప్తున్నప్పటికీ ఇంతవరకు అమలు కాలేదు, ధరలకు అనుగుణంగా జీతాలు పెంచి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో బడ్జెట్ సమావేశాల్లో సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికులను విజయవాడకు పిలిపిస్తామని సమీకరించి ధర్నా నిర్వహిస్తామని అన్నారు . 15 వ ఫైనాన్స్ ద్వారా పంచాయతీల్లో ఉన్నటువంటి సర్పంచి కార్యదర్శులు జీతాలు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పంచాయతీలో నిధులు లేవని మేము జీతాలు పెట్టలేమని సుమారు నాలుగు ఐదు సంవత్సరాలకు పని చేస్తున్న కార్మికుల్ని జీతాలు ఇవ్వలేము మీరు నిలిచిపోండని బెదిరించడాన్ని ఏఐటియుసిగా దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాము. పంచాయతీల ద్వారా జీతాలు సర్పంచులు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నందున స్వచ్ఛభారత్ ద్వారానే జీతాలు చెల్లించాలని ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ టి యు సి పట్టణ గౌరవ అధ్యక్షులు వేలన్, నాయకులు బాషా గ్రీన్ అంబాసిడర్ (క్లాప్ మిత్ర) యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్రన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ పాదం చెంచురామయ్య రవి నాయకులు దేశప్ప, దండమ్మ, జోసెఫ్, కుమార, కార్మికుల పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు డీఎం పురం విద్యార్థి

విశాలాంధ్ర - కార్వేటినగరం: జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడలకు డీఎం పురం ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం నమశ్శివాయ అన్నారు. సోమవారం జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థి బాలాజీకి ప్రశంసా పత్రాన్ని అందించి అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పల్నాడు జిల్లా నరసారావు పేటలో డీఎస్సీ స్టేడియంలో అండర్-14 విభాగానికి నిర్వహించి రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడల్లో పీ.బాలాజీ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికై మన జిల్లా పేరును నిలబెట్టాడని అన్నారు. విద్యార్థులకు అన్ని రకాలైన క్రీడల్లో తర్ఫీదు ఇచ్చి రాష్ట్రంలో నలు మూలల డీఎంపురం ఉన్నత పాఠశాల పేరును చాటి చెప్పేలా చేస్తున్న పీఈటీ తిరుమలరాజును అభినందించారు. ప్రతి విద్యార్థి విద్యలో కాకుండా క్రీడల్లోను రాణించాలని, బాలాజీని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఉపాధ్యాయులు బృంధం, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

విశాలాంధ్ర - కార్వేటినగరం: సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. సోమవారం స్థానిక సచివాలయం మూడును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలని ఆదేశించారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించిన యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. సమస్యలపై వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. సిబ్బందిపై మాకు ఫిర్యాధులు రాకుండా చూసుకోవాల్సిన అవసరం కార్యదర్శికి ఎంతైనా ఉందన్నారు. వలంటీర్లు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నార లేదా అన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.

ప్రతిపక్ష పార్టీల నాయకులపై పోలీసులు కేసు పెట్టడం ప్రభుత్వానికి తగదు

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి యస్ .నాగరాజు విమర్శ

విశాలాంధ్ర-పలమనేరు : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పలమనేరు నియోజకవర్గం సీపీఐ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేఖర్ల సమావేశంలో సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు పలమనేరు నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి ఎం. సుబ్రహ్మణ్యం పలమనేరు పట్టణ సిపిఐ కార్యదర్శి మంజునాథ్ బాబు లు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజా సమస్యల పైన ప్రభుత్వ వైఫల్యాలు పైన ప్రజా ప్రతినిధులు మొదలుకొని మంత్రులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీస్తూ ప్రశ్నిస్తూ ఎండ కడుతున్న ప్రతిపక్ష పార్టీల నాయకులపై గతంలో ఎన్నడు లేని విధంగా ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్ఆర్సిపి ప్రభుత్వ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షాల నాయకులను టార్గెట్ చేసి పోలీసులు కేసులు పెట్టడం ప్రభుత్వానికి తగదన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులు ఉపాధ్యాయులు కార్మికులు రైతులు మహిళలు విద్యార్థి యువజనలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైపల్యం చెందిందని తీవ్రంగా విమర్శించారు.ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వంలో ఉన్నటువంటి చీకటి చట్టాన్ని జి.ఓ.నెంబర్ 1నితీసుకువచ్చి ఉద్యమాలను అడ్డుకోవడం సరికాదన్నారు. వెంటనే జి.ఓనెంబర్ 1ని వెంటనే రద్దు చేయాలని లేని పక్షంలో ప్రతిపక్ష పార్టీలు ప్రజాస్వామ్యవాదులు ప్రజా సంఘాలు చేపట్టే ఛలో అసెంబ్లీకి సిద్ధమవుతున్నట్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం పలమనేరు నియోజకవర్గం కార్యదర్శి ఏ. గుర్రప్ప, పూతలపట్టు నియోజకవర్గం నాయకులు కే .రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీలకు నిజమైన స్వాతంత్ర్యం జగన్‌తోనే సాధ్యం:నారాయణస్వామి

విశాలాంధ్ర-కార్వేటినగరం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నిజమైన రాజకీయ స్వాతంత్ర్యం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమైందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ బడుగు, బలహీన, మైనారిటీలకు ఎమ్మెల్యే స్థానిక ఎన్నికల్లో అన్ని వర్గాల వారికి రాజకీయంలో సముచిత స్థానాన్ని కల్పించిన ఘనత దేశంలోనే ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో శెట్టిబలిజ(బీసీ)లకు బోయలకు 2) వడ్డెర్లకు (2) (ఎస్సీ-బీ. (1) ఎస్సీ - సీలకు (1) మత్సకారులకు (1) వన్నెరెడ్డికులస్తులకు(1), వడబలిజ(1) యాదవులకు (1) అలాగే ఓసిలతో రెడ్డి(1), కమ్మ(1) రాజులు(1) కాపు(1) అన్ని సామాజిక వర్గానికి రాజకీయ సమానత్వం కల్పించి జగనన్న నవసమాజాన్ని సృష్టించారని పేర్కొన్నారు. ఆదే విధంగా రాజ్యసభలో ఉన్న నలుగురితో కూడా బీసీ (యాదవులకు) ఇద్దరికి చోటు కల్పించారని గుర్తు చేశారు. 14 మసంవత రాలు అధికారంలో ఉంటూ వచ్చిన చంద్రబాబు ఎంతమంది బీసీలకు పదవులు ఇచ్చారో చెప్పాలను సూటిగా ప్రశ్నించారు. బీసీలను అణగ దొక్కడమే. లక్ష్యంగా పెట్టుకున్న చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పాలని మంత్రి పిలుపునిచ్చారు. కుల పిచ్చితో కులాల మధ్య చిచ్చులు పెట్టి వేరు చేయడమే. చంద్రబాబు లక్ష్యమని, అన్నదమ్ములుగా కలసి ఉన్న ఎస్సీలకు తన ఓటు బ్యాంకు కోసం రెండుగా చీల్చి చిచ్చు పెట్టిన ఘనత కూడా చంద్రబాబుదేనని. 100 మంత్రి పిలుపునిచ్చారు. కుల పిచ్చితో కులాల మధ్య చిచ్చులు పెట్టి వేరు చేయడమేచంద్రబాబు లక్ష్యమని, అన్నదమ్ములుగా కలసి ఉన్న ఎస్సీలకు తన ఓటు బ్యాంకు కోసం రెండుగా చీల్చి చిచ్చుపెట్టిన ఘనత కూడా చంద్రబాబుదేనని అన్నారు. తన సొంత సామాజిక వర్గం కూడా వ్యతిరేకిస్తూ మాట్లాడితే వారిని కూడా దూషించేందుకు వెనుకాడడం లేదన్నారు. మా జిల్లాలో బీజగన్మోహన్రెడ్డి కులాలను బట్టి ఓట్లు అడగలేదని, రాజకీయ సమానత్వం కల్పించేందుకు "కృషి చేస్తున్నారని అన్నారు.చంద్రబాబు అధికారంలోకి వస్తాడని టీడీపీ సైకోలు ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతూ కనీసం గ్రామాల్లో అభివృద్ధిపనుల కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారని. చంద్రబాబు తన నాయకులతో ఔపడుతు విధ్యాంస ఖాండాన్ని, ప్రజలు చూస్తున్నారని, ఇది టీడీడీ. ఇతనానికి నాంది అని హెచ్చరించారు.

హక్కును హక్కుగా అందించడమే న్యాయం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ కరుణ కుమార్

విశాలాంధ్ర -చిత్తూరు: కుల, మత, వర్గ, ప్రాంతాలకు అతీతంగా సమన్యాయాన్ని అందించడమే సామిజిక న్యాయం అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ మరియు సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో సామాజిక న్యాయం అమలు పై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ మరియు సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ భారత సుప్రీం కోర్టు మరియు హై కోర్టు వారి ఆదేశాల మేరకు నేడు ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సమన్యాయాన్ని అందించడమే సామిజిక న్యాయం అని అభివర్ణించారు. మన భారత రాజ్యాంగం అతిపెద్ద లిఖిత పూర్వక రాజ్యాంగం అని తెలిపారు.మన రాజ్యాంగంలో సామాజిక న్యాయం పై చాలా చట్టాలను పొందుపరచారని తెలిపారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 32 సామాజిక న్యాయం అంశాలను పొందుపరచారని, దీని ద్వారా ప్రాథమిక హక్కు లకు భంగం కలిగినట్లు అయితే నేరుగా గసుప్రీంకోర్టు లో రిట్ ను ఫైల్ చేసే అవకాశం కల్పించారని తెలిపారు. ప్రభుత్వ అధికారులుగా మరియు సిబ్బందిగా సామాజిక న్యాయం అందించడంలో భాగస్వాములు కావాలని అప్పుడే ప్రజలకు పారదర్శక, సుపరిపాలనను అందించగలుగుతారని తెలిపారు. సమాచార హక్కు చట్టం క్రింద అడిగిన సమాచారాన్ని జాప్యం లేకుండా అందించడం కూడా సామాజిక న్యాయంలో భాగమే అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాదిరి మణికంఠం కుటుంబాన్ని ఆదుకున్న జనసేన పార్టీ నాయకులు

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : నగిరి నియోజకవర్గంలోని నింద్ర మండల పరిధిలోని పాదిరి గ్రామానికి చెందిన క్రియశీల సభ్యత్వం చేసుకున్న పాదిరి మణికంఠన్ కుటుంబానికి ఐదు లక్షల బీమా చెక్కు ను అందజేసిన చిత్తూరు జిల్లా జనసేనపార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరి ప్రసాద్. నింద్ర మండల జనసేన అధ్యక్షుడు బంగి శివలింగం మణికంఠంకు ఇద్దరు ఆడబిడ్డలు, ఒక బాబు ఉన్నారు వారి చదువులకు మొత్తం ఖర్చులు నేనే చూసుకుంటానని హరి ప్రసాద్ భరోసా ఇచ్చారు మణికంఠ కుటుంబానికి జనసైనికులు ఎల్లవేళలా తోడుంటారని చిత్తూరు జిల్లా జనసేన పార్టీ నాయకులు పసుపులేటి హరి ప్రసాద్ వెల్లడి పవన్ కళ్యాణ్ ను అభిమానించే ప్రతి జన సైనికుడి నీ ఆదుకుంటారు జనసేన పార్టీ నాయకులు హరిప్రసాద్ ఉద్ఘాటన జనసేన పార్టీ క్రియశీల సభ్యత్వం ఫిబ్రవరి 29వ తేది వరకు నమోదు చేసుకోవచ్చని ఆయన అన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి జన సైనికుడికి పవన్ కళ్యాణ్ భరోసాగా భీమాను అమలు చేస్తారని ఆయన ధీమావ్యక్తం చేసారు నింద్ర మండలం అధ్యక్షుడు బంగి శివలింగం మాట్లాడుతూ మణికంఠ నింద్ర మండలంలో జన సేనకార్యక్రమాలకు ముందుండేవాడని అటువంటి అతనికి భీమా ద్వారా పార్టీ న్యాయం చేయడం సబబేనని వ్యాఖ్యానించారు. ఇలాంటి నాయకుడు దూరమవడం నాకు చాలా బాధాకరమని కన్నీటితో తెలియజేసిన నింద్ర మండల జనసేన పార్టీ అధ్యక్షులు బంగి.శివలింగం పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో ఆన్లైన్ మెరిట్ పరీక్ష 2023లో

ప్రథమ స్థానం నిలిచిన ఎస్ దీపిక

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : నారాయణవనం మండలంలోని ఎడ్యుకేషన్ ఏపీ ఫనీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్లైన్ మెరిట్ పరీక్ష 2023లో తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం బాలికల జిల్లా పరిషత్ హై స్కూల్ లో పదవ తరగతి చదువుతున్న ఎస్ దీపిక జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది.ఈ సందర్భంగా సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి వి శేఖర్ ఎస్ దీపక మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ ను ప్రత్యేకంగా అభినందించారు. దీపిక ప్రథమ స్థానంలో నిలవడం సంతోషంగా ఉందని, గ్రేడ్ ఉపాధ్యాయులను కూడా అభినందించారు. ఈ నెలాఖరులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో 8000 రూపాయలు నగదు విద్యా విషయక కిట్టు, సర్టిఫికెట్ మరియు మెమొంటో అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ సురేష్, ఐఇ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాగిశెట్టి లక్ష్మికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - తిరుపతి : గూడూరు పట్టణ గమళ్లపాలెంలో నివసిస్తున్న నాగిశెట్టి లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం గౌడ సంఘ నాయకులు సోమవారం 31వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా గౌడ సంఘ నాయకులు మాట్లాడుతూ లక్ష్మి కొంతకాలంగా నరాలకు సంబంధించిన వ్యాధితో చికిత్స పొందుతోందన్నారు. నెల్లూరులోని ప్రయివేటు ఆస్పత్రిలో మెరుగైన చికిత్స కోసం గౌడ కులస్థులందరూ నగదు సిద్ధం చేసి 31 వేల రూపాయలను లక్ష్మి కుమార్తెకు అందించినట్లు తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు చిట్టెం శ్రీనివాసులు గౌడ్, ఆరుమూళ్ల మల్లికార్జున, సమ్మిటి రఘు గౌడ్, చిరకాల శివ, శ్రావణ్, సిద్దయ్య, నారాయణ, మురళీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మేరిగ

విశాలాంధ్ర - తిరుపతి : ఉమ్మడి నెల్లూరు జిల్లా నుండి స్థానిక సంస్థల కోటాలో వైయస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మేరిగ మురళీధర్ ని నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని సోమవారం సాయంత్రం సీఎం క్యాంపు కార్యాలయంలో మేరిగ మురళీధర్ కలిసి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు శాసనసభ్యులు డాక్టర్ వెలగపల్లి వరప్రసాద రావు ఉన్నారు.

సిద్దేశ్వర స్వామి ఆలయానికి పెరిగిన ఆదాయం : ఈఓ

విశాలాంధ్ర : చిత్తూరు: శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి దేవస్థానము మహా శివ రాత్రి బ్రహ్మోత్సవములు సందర్భంగా టికెట్స్ అమ్మకము ద్వారా 6,65,300/- రూపాయలు తాత్కలిక హుండీ ద్వారా 1,68,219/- రూపాయలు ఆదాయం వచ్చినది అని ఆలయ మాజీ ఛైర్మన్ రేవతి రెడ్డప్ప రెడ్డి విలేకరుల సమాజంలో తెలిపారు.ప్రస్తుత పాలక మండలి సభ్యులు మంజుల , నాగిరెడ్డి, రాజేశ్వరి, జయంత్, సురేష్ బాబు,గీత, గంగోగి, ఎక్స్ అఫిషియో శివ ప్రసన్న శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆలయ కార్యనిర్వహణాధికారి జయకుమార్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ఏర్పాట్లు పాలు పంచుకున్న అధికారులు అనధికారులు పాలకమండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

క్రీడాకారులకు క్రీడలతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు: క్రీడాకారులకు క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్య మవు తుందని ఎంపీపీ సురేంద్ర నాథ్ రెడ్డి అన్నారు. పులిచెర్ల మండలం మంగళంపేట లో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా జరిగిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు సోమవారం ఎంపీపీ బహుమతులు పంపిణీ చేశారు. టోర్నమెంట్ లో విన్నర్ గా నిలిచిన ఎల్లో ఫైటర్స్ టీంకు రూ 15,116లు, రన్నర్ గా నిలిచిన వడ్డేపల్లె టీంకు 8116లు నగదు బహుమతిని ఎంపీపీ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మధు, వైస్ ఎంపీపీ రాశి ప్రసాద్, ఏఎంసి ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, సచివాలయాల కన్వీనర్ మురవత్ భాష తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర-చౌడేపల్లి: రెండు రోజుల క్రితం చారాల బస్టాండ్ సమీపం లో నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని నేడు చౌడేపల్లి పోలీసులు అరెస్టు చేశారు.అరెస్టు చేసిన వ్యక్తి వివరాలు ఇలా ఉన్నాయి.చౌడేపల్లి మండలం,దుర్గసముద్రం గ్రామపంచాయతీ, బండమీదపల్లి కి చెందిన గంగాధరం(36) అని ఎస్సై తెలిపారు. నిందితుల వద్ద నుండి ఐదు లీటర్ల నాటు సారా స్వాధీన పరచుకొని రిమాండుకు తరలించామనిచౌడేపల్లి యస్సై రవికుమార్ వెల్లడించారు.మీ పరిసర ప్రాంతాలలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే తమకు తెలియజేయాలన్నారు.

గృహ నిర్మాణాలను నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

విశాలాంధ్ర -పులిచెర్ల-కల్లూరు: ప్రభుత్వం నిర్దేశించిన మేరకు గృహ నిర్మాణాల లక్ష్యాలను సాధించాలని ఎంపీ డీవో సుగుణమ్మ అన్నారు. పులిచెర్ల ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం గృహ నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ గృహ నిర్మాణాల్లో ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేసే విధంగా లబ్ధిదారులను చైతన్య పరచాలని అన్నారు. గృహ నిర్మాణాలు పూర్తయిన మేరకు బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో నమోదు చేయాలని ఎలాంటి ఆలస్యం చూపరాదన్నారు. అనంతరం మండలంలోని గృహ నిర్మా ణాల ప్రగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ రెడ్డి అహ్మద్, కార్యదర్శి యుగంధర్, వెలుగు సిసి వహీద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు సునీల్ కుమార్, రోహిణి ,వెల్ఫేర్ అసిస్టెంట్ భరత్ పాల్గొన్నారు.

విజయవంతంగా అన్నదానం

విశాలాంధ్ర - రామకుప్పం : సుమారు నెల రోజుల నుండి జేపీ వెల్నెస్ ఫౌండేషన్ అధినేత జయప్రకాష్ ఆధ్వర్యంలో నిరంతరాయంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ శాంతిపురం మండల కేంద్రంలో పేద ప్రజలకు అండగా నేనున్నానంటూ తన వంతు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేదలకు కడుపు నిండా పట్టెడన్నం వడ్డించి ఆదుకోవాలని ముందుకు రావడం జరిగిందని జేపీ వెల్నెస్ ఫౌండేషన్ అధినేత జయప్రకాష్ పేర్కొన్నారు ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ అన్ని దానాలకన్నా అన్నదనమే మిన్న అన్న సూత్రాన్ని అమలు పరుస్తూ నిరుపేదలకు రుచికరమైన భోజనం అందించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అదేవిధంగా నిరుపేదలకు తనవంతు సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటానని ఆయన తెలిపారు కాగా సోమవారం సుమారు 30 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు కాగా అన్న దాన కార్యక్రమం తో పేదలు హర్షం వ్యక్తం చేశారు

వైభవంగా త్రిశూల స్నానం

విశాలాంధ్ర -పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు చివరి రోజు సోమవారం త్రిశూల స్నానం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు సాయంకాలం క్షయనోత్సవం నిర్వహిం చి ఊంజల సేవ జరిపారు.ఆలయ ప్రధాన అర్చకులు దివాకర్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

25న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-పలమనేరు: మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు సర్వసభ్య సమావేశం ఈనెల 25వ తేదీ 11 గంటలకు మండల అధ్యక్షురాలు రోజా అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరుగుతుందనిఎంపీడీవో విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి నిబంధనల ప్రకారం మండల ప్రజా సర్వసభ్యసాధారణ సమావేశం ముఖ్య కార్యనిర్వహణాధికారి చిత్తూరు వారికి తెలియజేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి నిబంధనల మేరకు సమావేశం జరుపు కొనుటకు అనుమతి మంజూరు చేసినారని తెలిపారు

విద్యార్థిని ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-పలమనేరు : స్థానిక రంగా కాంప్లెక్స్ వద్ద సోమవారం సాయంకాలం కీర్తి అనే విద్యార్థినికి పై చదువుల కోసం 1983 ఫ్రెండ్షిప్ అకాడమీ సభ్యులు ఆర్థిక సహాయం చేయడంజరిగింది.ఈ కార్యక్రమంలోశివకుమార్, శివ, రిటైర్డ్ టీచర్ రమణ,జయశంకర్, సుభాన్, వేలాయుధం, శివ నాతోపాటు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర తిరుపతి జిల్లా

దక్షిణ కైలాసానికి కల్యాణ శోభ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: దక్షిణ కైలాసానికి కల్యాణ శోభ సంతరించుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానం వారు అందజేసిన పట్టు వస్త్రాలను ధరించి గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి గజ వాహనం పైనా... జ్ఞానప్రసూనాంబదేవి సింహ వాహనం పైనా అధిరోహించి పెండ్లి మండపానికి బయలు దేరారు. ఆదిదంపతుల కల్యాణం కోసం పెండ్లిమండపం ముస్తాబైంది. ఈ కల్యాణ వేడుకలు తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం వేకువ జామున 3గంటల ప్రాంతంలో ఆది దంపతుల కల్యాణం నిర్వహించాలని ఆలయ పండితులు ముహూర్తం నిర్ణయించారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి గంగాభవానీ సమేత పరమశివుడు, జ్ఞానప్రసూనాంబ అమ్మవారి ఉత్సవ మూర్తులను అలంకార మండపంలో స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఆలయ పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం రాత్రి 11గంటల ప్రాంతంలో గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గజ వాహనం పైనా... జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని సింహ వాహనం పైనా అధిష్టింప చేసి పెండ్లిమండపం వద్దకు తీసుకొచ్చారు. స్వర్ణాభరణాలు ధరించి... గజ. సింహ వాహనాలపై ఊరేగుతూ విద్యుత్ దీప కాంతుల వెలుగుల్లో ధగధగ లాడుతున్న శివపార్వతులను చూసి భక్తులు పరవశించి పోయారు. మంగళ వాయిద్యాలు, మేళ తాళాలు మోగుతుండగా... పదాతి దళాలు ముందు నడుస్తుండగా స్వామి, అమ్మవార్లు పెండ్లిమండపం వద్దకు చేరుకున్నారు. అర్ధరాత్రి తరువాత శివపార్వతుల పెళ్లితంతు ప్రారంభమైంది. స్వామి, అమ్మవార్ల కల్యాణ ఘడియలో పెళ్లి చేసుకునేందుకు పలు జంటలు తరలి వచ్చాయి. కాగా వందల సంవత్సరాలుగా ఈ కల్యాణ మహోత్సవానికి ఉభయదారులుగా కైకాల వంశస్తులే ఉంటూ వస్తున్నారు. ఈ వంశానికి చెందిన తిరుపతి జిల్లా చెంబేడు గ్రామంతో పాటు 14 గ్రామాలకు చెందిన ప్రజలు ఉభయదారులు. అలాగే తమిళనాడులోని తిరుత్తణి ప్రాంతానికి సెంగుందర్, కులవెత్తుత్తూరు, మరబినార్ కులాలకు చెందిన వారు అమ్మవారి తరపున ఉభయ దారులుగా ఉంటున్నారు.

సిపాయికి తలుపు తట్టిన అదృష్టం-వరించిన శాసనమండలి పదవి

ముందే చెప్పిన 'విశాలాంధ్ర'

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తిరుపతి రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంకు అదృష్టం తలుపు తట్టింది. చిత్తూరు జిల్లా నుంచి స్థానిక సంస్థల విభాగంలో సిపాయికి శాసనమండలి సభ్యులుగా నియమిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయం విశాలాంధ్ర జాతీయ దినపత్రికలో ముందుగానే ప్రచురితమైన సంగతి తెలిసిందే. డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంకు శాసనమండలి పదవి దక్కడంతో ఆయన అభిమానుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన వారు. శ్రీకాళహస్తి నియోజక వర్గంలో ఈ సామాజిక వర్గానికి చెందిన వారు జయాపజయాలను శాసించే స్థాయిలో ఉన్నారు. అందుకే మెగాస్టార్ చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటు చేసిన సమయంలో ఆ పార్టీ అభ్యర్థిగా సిపాయి సుబ్రహ్మణ్యం పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో సిపాయికి 20వేలు పై చిలుకు ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో సిపాయి ఓటమి చూశారు. అయినా చిరంజీవి వెంటే ప్రజారాజ్యంలో కొనసాగారు. అయితే చిరంజీవి కాంగ్రెస్ పార్టీలో చేరి... ప్రజారాజ్యం పార్టీని రద్దు చేయడంతో సిపాయి సుబ్రహ్మణ్యం తెలుగుదేశం పార్టీలో చేరారు. రాష్ట్ర విభజన తరువాత ఏపీలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంను రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పోరేషన్ అధ్యక్షులుగా నియమించారు. వాస్తవానికి సిపాయి పార్టీ వ్యవహారాల్లో క్రియాశీలకంగా లేక పోయినా తెలుగుదేశం పార్టీ ఆయనకు సముచిత స్థానం కల్పించింది. 2019లో టీడీపీ అధికారం కోల్పోయాక కూడా సిపాయికి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ సిపాయి టీడీపీలో ఉన్నంత కాలం ఏనాడూ అసమ్మతి గళం వినిపించలేదు. గత నెల 27న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రారంభించిన 'యువగళం' పాదయాత్రలో కూడా సిపాయి పాల్గొన్నారు. కుప్పం నియోజకవర్గంలో నారా లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన వన్నెకుల క్షత్రియ నేతల సమావేశంలో కూడా ఈయన పాల్గొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సిపాయి సుబ్రహ్మణ్యం తెలుగుదేశం పార్టీని వీడతారని ఎవరూ ఊహించలేదు. వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికే చెందిన శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు సత్రవాడ మునిరామయ్య, ఆయన తనయులు సత్రవాడ ప్రవీణ్ వైసీపీ వీడి తెలుగుదేశం పార్టీలో చేరడంతో అదే సామాజిక వర్గానికి చెందిన సిపాయికి వైసీపీ నేతలు గాలం వేశారు. వైసీపీలో చేరితే శాసనమండలి పదవి ఇస్తామని ఆశ చూపారు. ఇందుకు అంగీకరించిన సిపాయి సుబ్రహ్మణ్యం ఇటీవల తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ సమయంలో తన భవిష్యత్తు కార్యాచరణ కూడా ప్రకటించలేదు. తన సామాజిక వర్గ నేతలతో కానీ అనుచరులతో కనీసం ఆత్మీయ సమావేశం కూడా ఏర్పాటు చేయలేదు. వైసీపీలో చేరతానని కూడా చెప్పలేదు. పక్కా ప్రణాళికతో వైసీపీ నేతలతో రహస్యంగా చర్చలు జరిపి... శాసనమండలి పదవి ఇచ్చే విధంగా ఆయన హామీ తీసుకున్నారు. ఇందుకు వారు కూడా అంగీకరించడంతో సోమవారం తాడేపల్లికు వెళ్లి వైసీపీ అదినేత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిశారు. ఆ కొద్ది సేపటికే సిపాయి సుబ్రహ్మణ్యంకు శాసనమండలి సభ్యులుగా పదవి ఇస్తున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఈ ప్రకటనతో సిపాయి అనుచరుల ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి. అయితే అదే సామాజిక వర్గానికి చెందిన వైసీపీ నేతలు కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఆవిర్భావం నుంచి ఎంతో క్రియాశీలకంగా పని చేసినా... పార్టీ కోసం ఆస్తులు పోగొట్టుకున్నా... అధిష్టానం తమను గుర్తించకుండా పార్టీ మారిన నేతకు గంటల వ్యవధిలో శాసనమండలి పదవి ఇవ్వడం ఎంత వరకు సబబని ఇదెలా సామాజిక న్యాయం అవుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. వీరిని వైసీపీ అధిష్టానం ఎలా బుజ్జగిస్తుందో వేచి చూడాలి.

కపిలేశ్వరాలయంలో ఘనంగా త్రిశూలస్నానం

విశాలాంధ్ర -తిరుపతి : తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన సోమవారం ఉదయం త్రిశూలస్నానం వైభవంగా జరిగింది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు శ్రీ నటరాజ స్వామివారు సూర్యప్రభ వాహనంపై అన్నారావు సర్కిల్ వరకు వెళ్లి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.ఉదయం 9 గంటలకు అర్చకులు శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం నిర్వహించారు. కపిలేశ్వరస్వామివారి ఆయుధమైన త్రిశూలానికి స్నపన తిరుమంజనం నిర్వహించి శాంతి చేకూర్చారు. పూర్ణాహుతి, కలశోద్వాసనం, మూలవర్లకు కలశాభిషేకం నిర్వహించారు.సాయంత్రం 6 నుండి రాత్రి 7 గంటల వరకు ధ్వజావరోహణంతో శ్రీకపిలేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. రాత్రి 8 నుండి 10 గంటల వరకు రావణాసుర వాహనసేవ జరుగనుంది.హరిబ్రహ్మాదులకే లభ్యం గాని పవిత్రపాదపద్మాలను హృదయ చక్రంలో నిలుపుకొని నిత్యం ధ్యానం చేసిన రాక్షసభక్తుడు రావణుడు. తపస్సంపన్నుడైన రావణుడు పర స్త్రీని చెరబట్టడమనే దుర్మార్గానికి పాల్పడటం, శిష్టులైన దేవతలకు హాని తలపెట్టడం వల్ల రామబాణానికి హతుడయ్యాడు. ఇలాంటి రావణుడిని వాహనంగా చేసుకుని శ్రీకపిలేశ్వరస్వామి భక్తులకు దర్శనమిస్తారు.ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

శాసనమండలిలో ఎస్సీవీ నాయుడుకు మొండి చెయ్యి

ఫలించని నాలుగేళ్ల నిరీక్షణ - అసంతృప్తిలో పెద్దాయన అనుచర వర్గం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవీనాయుడుకు వైసీపీ అధిష్టానం శాసనమండలిలో మళ్లీ మొండి చెయ్యి చూపింది. వైసీపీ అధిష్టాన నిర్ణయం పెద్దాయన అనుచర వర్గానికి తీవ్ర అసంతృప్తికి గురి చేస్తోంది. మూడు నియోజక వర్గాల్లో వైసీపీ గెలుపు బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకుని చెప్పిన మాట నిలబెట్టుకున్న ఎస్సీవీ నాయుడుకు వైసీపీ తగిన ప్రాధాన్యత ఇవ్వక పోవడంతో ఆయన అభిమానులు లోలోన రగిలి పోతున్నారు. శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవీనాయుడుకు ఈ దఫా శాసనమండలిలో పదవి తప్పకుండా లభిస్తుందని అందరూ ఆశించారు. ఇందుకు కారణం 2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైసీపీ అధిష్టానం ఇచ్చిన హామీ. 'ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు' సార్వత్రిక ఎన్నికల్లో ఎస్సీవీ నాయుడు సేవలను వినియోగించుకున్న వైసీపీ అధిష్టానం... ఆల తరువాత ఆయనను పూర్తిగా విస్మరించింది. శ్రీకాళహస్తి రాజకీయ పరిస్థితుల కారణంగా ఎస్సీవీకి పూర్తిగా ప్రాధాన్యత తగ్గించింది. ఎస్సీవీ నాయుడుకు శాసనమండలి పదవి ఇస్తామని హామీ ఇవ్వడంతోనే ఆయన తెలుగుదేశం నుంచి వైసీపీలో చేరారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాళహస్తితో పాటు సత్యవేడు, వెంకటగిరి నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థుల విజయానికి ఎస్సీవీ నాయుడు చేసిన కృషి మరువలేనిది. ఆయన కృషి ఫలితంగానే శ్రీకాళహస్తిలో వైసీపీ ఎన్నడూ లేని విధంగా 38,141 ఓట్లు మెజారిటీ సాధించింది. శ్రీకాళహస్తి చరిత్రలో ఇదే అత్యధిక మెజారిటీ. అయితే ఎన్నికల తరువాత ఓ ప్రణాళిక ప్రకారం ఎస్సీవీ నాయుడు వర్గానికి క్రమేణా ప్రాధాన్యత తగ్గిస్తూ వచ్చారు. నియోజకవర్గంలో ఆయన చెప్పే పనులు ఏవీ జరగకుండా చేశారు. అయినా పెద్దాయన ఎక్కడా అసమ్మతి గళం విప్పలేదు. స్థానికంగా తనకు ప్రాధాన్యత ఇవ్వక పోయినా ఎంతో సహనం పాటిస్తూ వచ్చారు. ఇందుకు కారణం అధిష్టానం హామీ. మొదటి విడతలోనే ఎస్సీవీ నాయుడుకు శాసనమండలి పదవి ఇస్తారని అందరూ భావించారు. అయితే మొదటి విడతలో ఆయనకు పదవి దక్కలేదు. అయినా ఆయన పెదవి విప్పలేదు. మరో అవకాశం కోసం ఎదురు చూశారు. రెండవ దఫా తప్పకుండా ఎస్సీవీకి శాసనమండలి పదవి వస్తుందని ఆయన అనుచర వర్గం ఆశతో ఎదురు చూసింది. ఇంతలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంను కొంతమంది అధికార పార్టీ నేతలు బరిలోకి తీసుకు వచ్చారు. ఆఘ మేఘాలపై తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయించారు. వన్నెకుల క్షత్రియ కులానికి చెందిన ఓట్లు తిరుపతి జిల్లాలో వైసీపీకే గంపగుత్తగా పడతాయని చెప్పి... సిపాయికి స్థానిక సంస్థల కోటాలో శాసనమండలి పదవి ఇచ్చారు. ఈ కారణంగా తిరుపతి జిల్లాకే చెందిన ఎస్సీవీనాయుడుకు ఈ పదవి దక్కలేదు. శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి నియోజకవర్గాల్లో బలమైన వర్గం కలిగిన ఎస్సీవీ నాయుడుకు శాసనమండలిలో స్థానం కల్పించక పోవడం వైసీపీకి తీరని నష్టం కలుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అధిష్టాన నిర్ణయంతో ఎస్సీవీనాయుడు కూడా మనస్థాపానికి గురైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఎస్సీవీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. న్యాయం జరగనపుడు ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని అనుచర వర్గం కూడా ఎస్సీవీనాయుడుపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. ఇపుడు అందరూ పెద్దాయన నిర్ణయం కోసం వేచి చూస్తున్నారు. ఏం జరుగుతుందో వేచి చూద్దాం.

హాస్పిటల్స్ అధినేత ప్రజా సేవకుడు

విశాలాంధ్ర - ఏర్పేడు: రష్ హాస్పిటల్స్ అధినేత ప్రజా సేవకుడు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తికి చట్టసభల్లో గుర్తింపు ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేసిన ఇసుక తగిలి గ్రామ ప్రజలు డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంకి ఎమ్మెల్సీగా ఇచ్చిన శుభ సందర్భంగా ఇసుక తాగేలి గ్రామంలోని ప్రజలు ఆనందంతో టపాసులు పేల్చారు.మరియు ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి మరియు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

రీ సర్వే కిట్‌లను పంపిణీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర - తిరుపతి : జిల్లాలో మొదటి విడతగా 200 గ్రామాలకు చెందిన విలేజ్ సర్వేయర్లకు/ వీఆర్వోలకు క్షేత్రస్థాయిలో సర్వే చేయుటకు వినియోగించే కిట్లను జిల్లా కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి జెసి డికే బాలాజీ, ఆర్డీఓ కనక నరస రెడ్డి, జిల్లా సర్వే అధికారి జయరాజ్ తో కలసి రీసర్వే కిట్లను విలేజ్ సర్వేయర్లు/ వీఆర్వో లకు పంపిణీ చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్లో రీ సర్వే కిట్లని పంపిణీ చేసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ కిట్ లో రీ సర్వే కు ఉపయోగపడే సుమారు 2500 రూపాయల విలువచేసే ఉపకరణాలు బ్యాగు, మెడికల్ కిట్టు, బూట్లు, వాటర్ బాటిల్, పెన్ను, పెన్సిల్, బుక్ తదితరాలు మొదటి విడతగా 200 మంది కి పంపిణీ చేస్తున్నామని వీటిని రీ సర్వే విధులకు హాజరయ్యే విలేజ్ సర్వేయర్లు వీఆర్వోల సౌకర్యార్థం వీటిని వినియోగించుకోవాలని తెలిపారు. రీ సర్వే పూర్తి అయిన భూములలో హద్దురాళ్ళను నాటడం వేగవంతం చేయాలని సర్వే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వే డిపార్ట్మెంట్ అధికారులు సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'యువగళం' పాదయాత్ర యథాతథం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర మంగళవారం నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ శ్రేణులు తెలియచేశాయి. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నారా లోకేష్ ఇప్పటి వరకు 22రోజుల వ్యవధిలో 296.6కి.మీ. దూరం నడిచి శ్రీకాళహస్తి చేరుకున్నారని... మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఒక రోజు విరామం తీసుకున్నారని అదే రోజు నందమూరి తారకరత్న తుదిశ్వాస విడవడంతో పాదయాత్రకు విరామం ప్రకటించాల్సి వచ్చిందన్నారు. 23వ రోజున ఉదయం 8గంటలకు శ్రీకాళహస్తి ఆర్టీవో ఆఫీస్ ఎదుట విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై 8.20-మిట్టకండ్రిగలో స్థానికులతో మాటామంచి10గంటలకు తొండమనాడులో స్థానికులతో మాటామంచి 10.15 గంటలకు తొండమానుపురం దిగువ వీధిలో 300 కి.మీ పూర్తి అయిన సందర్భంగా శిలాఫలకం ఆవిష్కరణ 10.20కి తొండమానుపురం దిగువ వీధిలో మహిళలతో ముఖాముఖి 11.10కి సుబ్బానాయుడు కండ్రికలో స్థానికులతో మాటామంచి మధ్యాహ్నం 12.30కి వెంకటాపురంలో భోజన విరామం(వన్నె కుల క్షత్రియ సమావేశం) 2గంటలకు బండారుపల్లిలో స్థానికులతో మాటామంచిసాయంత్రం 4.30కి కోబాక 5.30గంటలకు కోబాక విడిది కేంద్రంలో బస చేస్తారని టీడీపీ శ్రేణులు తెలిపాయి.

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీ శ్వర స్వామి వారి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జైరాం ఠాఖుర్ కుటుంబ సమేతముగా సోమవారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల దర్శనార్థం శ్రీకాళహస్తి ఆలయమునకు విచ్చేసిన హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జైరాం ఠాఖుర్ కు ఆలయ అతిథి గృహంవద్ద బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్ బాబు నియోజకవర్గ బిజెపి నాయకులతో కలసి ముందుగా జైరామ్ ఠాఖుర్ కి స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయం లోపల నిర్వహించే ప్రత్యేక రాహు - కేతు పూజల్లో పాల్గొని స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కన్నా వెంకటేశ్వర్లు, కొండేటి గోపాల్, ప్రజ్ఞశ్రీ, పుణ్యం ఢిల్లీ, గాండ్ల శివకుమార్, మెండు బాల గురవయ్య యాదవ్, యువమోర్చ సభ్యులు భరత్, సజ్జ హరీష్, చందు రాయల్, రవి రాయల్, నాని, గిరినంద సాయి తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు విద్యతో పాటు రక్షణ నైపుణ్యం అవసరం : బియ్యపు పవిత్ర రెడ్డి

విశాలాంధ్ర - రేణిగుంట : నేటి సమాజంలో బాలికలకు విద్యతోపాటు స్వీయ రక్షణ నైపుణ్యం కూడా ఎంతో అవసరమని రేణిగుంట మండల వైకాపా ఇన్చార్జి బియ్యపు పవిత్ర రెడ్డి అన్నారు. రేణిగుంట ఓల్డ్ చెక్ పోస్ట్ ఇన్ఫాంట్ జీసస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ని విద్యార్థులకు గ్రాండ్ మాస్టర్ లు ఆర్ సుందర మూర్తి, పి దేవరాజులు ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బియ్యపు పవిత్ర రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులతో పాటు పవిత్ర రెడ్డి ట్యూబ్ లైట్ బ్రేక్ విన్యాసం చేశారు. అనంతరం పవిత్ర రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు వివిధ రకాల బెల్ట్ లను అందించారు. ఈ సందర్భంగా బియ్యపు పవిత్ర రెడ్డి మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిలిచిన పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాఠశాలలో విద్యతోపాటు కరాటే ను విద్యార్థులకు నేర్పించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ అనేది చాలా అవసరమని, ఏ ఒక్కరి పైన ఆధారపడకుండా తమను తాము రక్షించుకునే విద్యను అభ్యసించడం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఆనంద్, ముకుంద పాఠశాల ఫాదర్ లు సుసైనాదన్, సైమన్ గుడిమి, సర్పంచ్ నగేషం, వైకాపా పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, పాఠశాల హెచ్ఎం అల్ఫర్డ్ ప్రేమ్చంద్, కరాటే ఇంచార్జ్ సౌందర్య, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం

విశాలాంధ్ర-చిల్లకూరు: అదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం తమ్మినపట్నం పంచాయతీ గుమ్మళ్ళదిబ్బ గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులతో కలిసి వీధుల్లోని చెత్తను తొలగించి, వీధులను ఊడ్చి శుభ్రం చేశారు. మురుగు నీరు ఉండకుండా చేయాలని సూచించారు. పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరంగా ఉంటాయన్నారు. 200 మందితో గ్రామంలోని చెత్తను తొలగించారు. పరిశుభ్రత పాటిస్తే పర్యావరణానికి మేలు జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం , పంచాయతీ కార్యదర్శి గరుడయ్య , ఫౌండేషన్ ప్రతినిధులు, అదానీ క్రిష్ణపట్నం పోర్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

23నుండి చెంగాళమ్మ ఆలయంలో కుంభాభిషేకం

విశాలాంధ్ర - సూళ్లూరు పేట: సూళ్లూరుపేట లో వెలసి ఉన్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో స్వర్ణ తాపడం తో సిద్ధమైన విమాన గోపురం కుంభాభిషేకం వేడుకల్లో అందరు పాల్గొనాలని ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్ర రెడ్డి విజ్ఞప్తి చేశారు, సోమవారం ఆలయ ఆవరణం లో జరిగిన విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడుతూ, 22 వ తేదీ నుండి 24 వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ నూతన స్వర్ణ విమాన గోపురం శిఖర ప్రతిష్టమహా కుంభాభిషేక మహోత్సవం లో భాగంగా ప్రతి రోజు లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేసారు, 24 వ తేదీ ఉదయం 7 గంటలకు గోపురాలపై కలశ స్థాపనలు కుంభాభిషేకం కనులారా వీక్షించిన వారికి మంచి జరుగుతుందన్నారు. ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి నేతృత్వం కుంభాభిషేకం వేడుకల ఏర్పాట్లను ముమ్మ రంగా నిర్వహిస్తున్నారు, ఆలయ ట్రస్ట్ సభ్యులు సహకారాన్ని అందజేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - తిరుపతి :గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు గోపి మాట్లాడుతూ నిరంతరం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. గత నెల 30వ తేదీన రిలే దీక్షలు చేసినప్పుడు పది రోజుల్లో జీతాలు అందిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు. కానీ 20 రోజులు అవుతున్నప్పటికీ ఇంత వరకు జీతాలు ఇవ్వలేదన్నారు. అప్పులు చేసి జీవనం సాగిస్తున్నామన్నారు. వెంటనే కార్మికుల జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో జోగి శివకుమార్, బీవీ రమణయ్య, ముత్యాలయ్య, ఆర్. శ్రీనివాసులు, అడపాల ప్రసాద్, సురేష్, బండి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా నేదురుమల్లి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కోట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి 88వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని విద్యానగర్ నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్ లో రక్తదానశిబిరం జరిగింది.ఈశిబిరాన్ని నేదురుమల్లి ఫౌండేషన్ చైర్మన్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు.ముందుగా నేదురుమల్లి జనార్దన్ రెడ్డి,చిత్రపటానికి పూలమాలనేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తన తండ్రి జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయటంతోపాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.నెల్లూరు రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది150 యూనిట్లు,గూడూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాల సిబ్బంది 75 యూనిట్లు,నెల్లూరు డిఎస్ఆర్ గవర్నమెంట్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది 45 యూనిట్లు రక్తాన్ని దాతల నుండి సేకరించారు ఈ కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర సీఈసీ సభ్యులు కొడవలూరు.ధనంజయ రెడ్డి కొడవలూరు.భక్తవత్సల రెడ్డి దేవారెడ్డి.నాగూర్ రెడ్డి, వేమారెడ్డి.షనీల్ రెడ్డి ఎన్.బి.కె.ఆర్ ఐఎస్టి డైరెక్టర్ డాక్టర్.వి.విజయ్ కుమార్ రెడ్డి వివిధ విభాగాధిపతులు ఎన్.బి.కే.ఆర్. సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ మేనేజర్ రామకృష్ణారెడ్డి, విద్యార్థిని,విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

అధికార నందిపై ఆదిదేవుని వైభవం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 8వ రోజైన సోమవారం ఉదయం ఆదిదేవుడు అధికార నందిపై పురవిహారం చేశారు. ఆదిదేవుని దేవేరి జ్ఞానప్రసూనాంబదేవి కామధేనువుపై ఆయనను అనుసరించారు. అంతకు మునుపు అలంకార మండపంలో గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ఆలయ పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వరుని అధికార నందిపై జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని కామధేనువు పైనా అధిష్టించి పురవిహారానికి తీసుకు వచ్చారు. మూషిక వాహనంపై వినాయకుడు, చప్పరాలపై శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప స్వామి, అమ్మ వార్లను అనుసరించారు. మంగళవాయిద్యాలు, మేళ తాళాల మధ్య పురవిహారానికి వచ్చిన ఆదిదంపతులను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. కర్పూర హారతుల సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు సభాపతి కల్యాణం

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సాలను పురస్కరించుకుని 9రోజైన మంగళవారం సభాపతి కల్యాణం నిర్వహించనున్నారు. సభాపతిగా పిలువబడే నటరాజస్వామికి శివకామసుందరితో కల్యాణం నిర్వహిస్తారు. ఈ కల్యాణం ఆలయ ప్రాంగణంలోని 16కాళ్లు మండపం వద్ద జరుగుతుంది. ఇక సభాపతి కల్యాణం జరిగే రాత్రిని ఆనందరాత్రిగా వ్యవహరిస్తారు. నాగభూషణుడు నటరాజుగా ఆనంద తాండవం చేస్తాడు. నారద తుంబరుడు, సకల యక్ష, గాంధర్వ గానంతో, వాయిద్య ఘోషలతో ఆనందరాత్రి వేళ కైలాసగిరులు ప్రతిధ్వనించనున్నాయి.

యాక్ట్ 2007 మేరకు సీనియర్ సిటిజన్స్ భ్రుతి చెల్లించాలి :కలెక్టర్

విశాలాంధ్ర - తిరుపతి : సీనియర్ సిటిజన్స్ యాక్ట్ 2007 తప్పనిసరి అమలుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఎ.డి. శ్రీనివాస్ ను జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ వారికి అందిన అర్జీదారుల పిటీషన్లను పరిశీలించి సంబంధిత కుటుంబ సభ్యులతో వాదనలు విని పలు సూచనలు చేశారు. ఒరిస్సా వాసులు తన కుమారుడు బిక్రం ఉపాధ్యాయ తన జీవనానికి జీవన భ్రుతి చెల్లించాలని కోరిన మేరకు అతను చిన్నపాటి ఉద్యోగం కావున పోషణకు హరే కృష్ణ ఉపాధ్యాయ కు నెలకు రూ.3200/- అందించాలని సూచించిన మేరకు తండ్రి అంగీకారంతో ఉత్తర్వులు జారీ చేశారు. నాయుడుపేట మండలం పుదూరు గ్రామానికి చెందిన జయరామయ్య తన ఆస్తి విషయమై కుమార్తె, మనవళ్ళు తీసుకుని సరిగా చూడడంలేదని ఇచ్చిన పిటీషన్ మేరకు సివిల్ కేసుగా దీనిని గూడూరు ఆర్డిఓ పరిశీలించి తగు న్యాయం చేయవలసినదిగా ఆదేశాలను జారీ చేశారు.

కపిలతీర్థంలో ఆకట్టుకున్న భక్తి సంగీత కార్యక్రమాలు

విశాలాంధ్ర -తిరుపతి: శ్రీ కపిలేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద సోమవారం నిర్వహించిన ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, నాదస్వరం పాఠశాల, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 9.30 గంటల వరకు ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.ముందుగా హరికథ గానం జరిగింది. అనంతరం ఎస్వీ నాదస్వర పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ రామచంద్ర రావు శ్రీ చంద్రశేఖర్ డోలు, శ్రీ నటరాజ్ నాదస్వరం వాయిద్యాలతో మంగళధ్వని వినిపించారు. కళాశాల అధ్యాపకులు శ్రీ శబరి గిరీష్ బృందం గాత్రము, జయరాం వాయిలీన్, రఘురాం మృదంగంపై గణపతి భజన...., కపిలేశ్వర స్తోత్రం...., సుబ్రమణ్య భజన ....,గురు భజన, మృత్యుంజయ భజన..., శివ భజన...., దుర్గ భజన.... తదితర కీర్తనలను అద్భుతంగా ఆలపించారు.అదేవిధంగా కళాశాల అధ్యాపకులు శ్రీ పవన్ కుమార్ నృత్య పర్యవేక్షణలో విద్యార్థినులు చక్కగా భరతనాట్యాన్ని ప్రదర్శించారు. ఇందులో సరస్వతి పుష్పాంజలి, చంద్ర చూడా, శివన్ మంగళం, శివ స్తుతి.... తదితర కీర్తనలతో పాటు శ్రీశైల మల్లన్న, జానపద నృత్య ప్రదర్శన చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్వీ సంగీత కళాశాల ప్రత్యేకాధికారి శ్రీ శేష శైలేంద్ర, ప్రిన్సిపల్ శ్రీ ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.